క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మస్తానమ్మ

ఏర్పేడు: అనారోగ్యంతో తిరుపతిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ మస్తానమ్మ ఆదివారం పెన్షన్ అందజేసింది. మండలంలోని ఇసుకతాగేలి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(76) అనారోగ్యంతో వారం రోజులుగా తిరుపతి చికిత్స పొందుతుంది. వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి ఆమె వేలిముద్రలు సేకరించి పింఛన్ నగదును అందించింది.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


దివ్యాంగులు, వృద్ధులతో ఏఎస్ఐ హబీబ్

ఏర్పేడు: మండలంలోని వికృతమాల నీలాద్రి భవన సముదాయంలోని లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ పరిరక్షణలో ఉన్న 32 మంది దివ్యాంగులు, వృద్ధుల మధ్య కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సాయిదమ్మ, ప్రతినిధులు పద్మజ, రాజేష్, ఆదర్శ సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఐతేపల్లి గురునాథం, ఏఎస్ఐ హబీబ్, వికలాంగులు, వృద్ధులు పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి


నాగలాపురం : కొడియంబేడు మడుగును పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నాగలాపురం: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్సై ఓబయ్య తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొడియంబేడు మడుగును వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ వంకలు, వాగులు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పూడిక తొలగింపు



తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని చెంబేడు కాలువలో పూడికతీత పనులను ఆదివారం చేపట్టారు. తొట్టంబేడు, పెళ్లకూరు, తదితర పలు మండలాల్లో చెరువులకు స్వర్ణముఖి నుంచి నీటిని అందించే ఈ కాలువ పూడిపోయి ఉండడంతో ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికను జేసీబీల సాయంతో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. మండలంలో పాయ్య సమీపంలో జరుగుతున్న ఈ పనులను ఈఈ మదన్‌గోపాల్, ఏఈ రాఘవేంద్ర తదితరులు పరిశీలించారు.

శాస్త్రోక్తంగా రుద్రయాగం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజైన ఆదివారం రుద్రయాగం శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మనువాదంతో పోరాటమే పంచుకుందాం..రా

గంగవరం: పలమనేరు మండలంలోని కళామందిరంలో పానుగోటి కృపాకర్ కవితా సంపుటి పంచుకుందాం రా.. పరిచయ వేదిక ఆదివారం కార్యక్రమానికి ప్రసిద్ధ సాహితీవేత్తలు జూపాక సుభద్ర, కవితశ్రీ, కుమారస్వామిరెడ్డి, సిద్ధార్థ, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, బాల్జి, గంటామోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, యుగంధర్, గిరిధరమూర్తి, శ్రీనివాస తదితరులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. మనువాదంతో పోరాటమే 'పంచుకుందాం రా' అని పేర్కొన్నారు. వర్తమాన తెలుగు కవిత్వంలో కొత్త ఒరవడి కృపాకర్ కవితా సంపుటి అని, బహుజన సాహిత్యానికి ఒక మేలిమ కూర్పు అని వ్యాఖ్యానించారు. అద్భుతమైన కవిత్వాన్ని కృపాకర్ అందించారని అభినందించారు. అనంతరం కవి పానుగోటి కృపాకర్ దంపతుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజి, తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసినాధంనాయుడు పాల్గొన్నారు.

మిచాంగ్ బీభత్సం

- పొంగుతున్న కాజ్‌వేలు, వాగులు, వంకలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, పూరి గుడిసెలు
- వరవ కాల్వకు గండ్లు, చెరువులకు జలకళ
- స్తంభించిన జన జీవనం


ఏర్పేడు: నిండుకున్న కోబాక చెరువు

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలు వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి. చెరువులు దాదాపు నిండే దశకు చేరుకున్నాయి. తీవ్రమైన గాలులకు విద్యుత్ స్తంభాలు, పూరి గుడిసెలు నేలకొరిగాయి. శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నది పరవళ్లు తొక్కుతోంది. పిచ్చాటూరులోని అరణియార్ జలాశయంలో నీటిమట్టం 25 అడగులకు చేరింది. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ నిండడంతో 8 గేట్లను తెరిచి నీటిని కిందకి వదులుతున్నారు. ఈ వర్షాలు రబీపంటల సాగుకు ఎంతో మేలు చేస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పేడు: మిచాంగ్ తుపాన్ గాలీవానకు మండలంలోని చిందేపల్లె, నచ్చనేరి, రాజులపాలెం, పల్లం, పాతవీరాపురం, రావిళ్లవారికండ్రిగ తదితర ఎస్టీ కాలనీలలో పలు పూరిగుడిసెలు నేలకూలడంతో ఎస్టీలు నిరాశ్రయులయ్యారు. అంజిమేడు, మాధవమాల, ఇసుకతాగేలి, కందాడు, సీతారాంపేట తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రేణిగుంట మండలం మల్లిమడుగు రిజర్వాయర్ నుంచి అంజిమేడు చెరువుకు నీటిని అందించే వరవకాల్వకు మూడు చోట్ల గండ్లుపడంతో నీరు వ్యవసాయ పొలాలపై ఉధృతంగా ప్రవహిస్తోంది. వరినాట్లు, వరి నారుమడులు నీట మునిగాయి. అంజిమేడు, చింతలపాలెం, ఇసుకతాగేలి, కోబాక, సీతారాంపేట, నచ్చనేరి, పాతవీరాపురం, కుప్పయ్యకండ్రిగ, ఆమందూరు, గుడిమల్లం, మేర్లపాక చెరువులు జలకలను సంతరించు కున్నాయి. కందాడు, ఎస్సీ కాలనీ, చిందేపల్లి, సీతారాంపేట తదితర గ్రామాల వద్ద నీటిని గ్రామాలపైకి రాకుండా మళ్లించారు. ఏర్పేడు సీఐ శ్రీహరి, తహసీల్దారు శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య ఆధ్వర్యంలో కాజ్‌వేలు, సీతకాల్వ, వరవ కాల్వ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, గ్రామస్తులకు అవగాహన కల్పించి, వలంటీర్లు, పోలీసులను గస్తీ పెట్టారు.

రాకపోకలు స్తంభన

కొత్తవీరాపురం, గోవిందవరం గ్రామాలకు సమీపంలోని స్వర్ణముఖి నదిపై ఉన్న కాజ్‌వేలు, అంజిమేడు సమీపంలోని బండమానివాగు, గుడిమల్లం సీతకాల్వ, వికృతమాల ఎస్సీకాలనీ వద్ద కోనకాల్వ, కందాడు, ముసలిపేడు, నచ్చనేరి, చిందేపల్లి, సీతారాంపేట తదితర గ్రామాలకు అటవీ ప్రాంతాల నుంచి చెరువులకు నీటిని అందించే వరవ కాల్వలు నీటితో పొంగి పొర్లుతున్నాయి. ఈ ప్రాంతాలకు రాకపోకలు స్థంభించాయి.

రాకపోకల బంద్

సత్యవేడు: పీవీపురం పంచాయతీ పరిధిలోని ఓబులరాజు కండ్రిగ సమీపంలోని గొడ్డేరుకు ఉధృతంగా వరద నీరు చేరడంతో నాగలాపురం- పాందూరు మధ్య రాకపోకలు బంద్ అయ్యింది. తుపాను ప్రభావంతో ఆదివారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం ఎడతెరపి లేకుండా కురిసింది. గొడ్డేరులో వరద నీరు అధికంగా ప్రవహిస్తుండంతో ఆమార్గంలోని పీవీపురం, ఓబులరాజు కండ్రిగ, చమర్తి కండ్రిగ, రేపల్లెవాడ, రాజగోపాలపురం రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ జరీనా వీఆర్ఓలను అప్రమత్తం చేసి కాపలా ఉంచారు. మండల పరిధిలోని చిన్నఈటిపాకం-పెద్ద ఈటిపాకం మార్గంలో వర్షాలకు రోడ్డు సమీపంలోని పెద్ద చెట్టు కూలడంతో రాకపోకలకు గంటపాటు ఇబ్బంది కలిగింది. సర్పంచ్ గోవిందస్వామి సహకారంతో రెవెన్యూ సిబ్బంది చెట్టు కొమ్మలు నరికి జేసీబీతో అడ్డు తొలగించారు. సత్యవేడు మండలంలో ఆదివారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. శనివారం రాత్రినుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు 36.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. వర్షపు నీరు రోడ్లపై నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.


నారాయణవనం : ఆకర్షిస్తున్న తుంబురతీర్థం


ఏర్పేడు: ఇసుకతాగేలి వద్ద వరవకాల్వకు పడిన గండి


గోవిందవరం కాజ్‌వే వద్ద సూచనలిస్తున్న సీఐ శ్రీహరి


నారాయణవనం : కైలాసకోనలో జలపాతం హోరు

నీట మునిగిన పంటలు


గోవర్ధనపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



కదూరు వద్ద నీట మునిగిన వరి పంట, పెద్ద పాండూరు మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం ప్రాంతంలో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శనివారం సాయంత్రం 6 నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 102.6 మిమీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. కదూరు, చిలమత్తూరు, గూడలవారిపాళెం, తాగేలి, సీఎల్ఎన్‌పల్లి ప్రాంతాల్లో పంట నీట మునిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే పంట దెబ్బతినడమే కాకుండా చెరువులు కూడా ప్రమాదస్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో వీధులు జలమయం కావడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. రోజువారీ కూలీలు, మరమగ్గాల నేతన్నలు, చేతివృత్తుల వారు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారు.

పలు ప్రాంతాల్లో స్తంభించిన రాకపోకలు

మండలంలోని పెద్ద పాండూరు నుంచి తొండంబట్టుకు వెళ్లే రాళ్లవాగు లోలెవల్ కాజ్‌వేపై వరదనీరు ఉధృతి పెరగడంతో ఆదివారం తెల్లవారుజాము నుంచే రాకపోకలు స్తంభించాయి. సిద్దేశ్వరపురం, వెంకటేశ్వర గిరిజనకాలనీ, కుప్పటతాగేలి, తొండంబట్టు, నాగనందాపురం, అంబికాపురం, ఎంజీనగర్, సిద్ధాపురం గ్రామాల వారికి రాకపోకలు స్తంభించాయి. వరదయ్యపాళెం-సంతవేలూరు మార్గంలోని పులిబొంద, మార్లమడుగు కాలువల్లో నీటి ఉధృతి పెరగడంతో ఆ మార్గంలో కూడా రాకపోకలు స్తంభించాయి. వరదయ్యపాళెం పంచాయతీలోని బీజీఆర్ గిరిజనకాలనీ, అనిల్ గిరిజనకాలనీల్లోకి పెద్దఎత్తున వర్షపునీరు చేరుకుంది. కాలనీ వాసులను సమీపంలోని గోవర్ధనపురం ప్రాథమిక పాఠశాలకు తరలించారు.


కదూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కరుణానది


మార్లమడుగు వద్ద పోలీసుల భద్రతా ఏర్పాట్లు

వంతెనల వద్ద సహాయక చర్యలు

ఉధృతంగా ప్రవహిస్తున్న వంతెనల వద్ద ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు గట్టి చర్యలు తీసుకున్నారు. పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాముల కాలువ వద్ద ఎస్ఐ, సిబ్బందితో స్వయంగా వాహనాలను దాటిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాల పట్ల రైతులు, ప్రజలు, ఇతర వర్గాల వారు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

జడివాన- జల దిగ్బంధం


కుమ్మరికండ్రిక పంట పొలాల్లో వర్షపు నీరు



రేణిగుంట: తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా జడివాన కురుస్తుండడంతో రేణిగుంట మండలంలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలకు చేరి జనావాసాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రేణిగుంట పట్టణంలోని బిస్మిల్లానగర్, భగత్‌సింగ్ కాలనీ, రజక కాలనీ, వివేకానంద కాలనీల చుట్టూ వర్షపు నీరు చేరింది. సర్పంచ్ నగేషం జేసీబీ సాయంతో నీటిని వాగు వైపు మళ్లించారు. మండలంలోని గాజులమండ్యం స్వర్ణముఖీ నదిలో రజక కాలనీ తాగునీటి బోరు నీట మునగడంతో సర్పంచ్ గంగారి రమేష్ ఆధ్వర్యంలో మోటారును బయటకు తీసి మరమత్తులు చేపట్టారు. గాజులమండ్యం దేశమ్మనగర్, ఏపీఐఐసీ క్వార్టర్స్‌లో వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో దారిమళ్లించారు. కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో వర్షపు నీరు ఇళ్ల చుట్టూ చేరడంతో వైఎస్సార్ సీపీ నేత మన్యం శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కన్నయ్య జేసీబీ సాయంతో కాలువలు తీసి నీటిని కింది వైపునకు మళ్లించారు.


అడ్డగించిన వాగులు- రాకపోకలు బంద్


మండలంలో కల్లూరు వంక ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు రాకపోకలు నిలిచిపోయాయి.


ఆర్.మల్లవరంలో నీట మునిగిన వరినాట్లు

గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కంచె ఏర్పాటు చేసి అక్కడ పహారా కాశారు. అత్తూరు కాలువ పొంగి ప్రవహించింది. కృష్ణాపురం లోలెవల్ కాజ్‌వేపై నీటి ప్రవాహం పెరగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని రాక,పోకలను నిలిపివేశారు. జీపాళెం, నల్లపాళెం మార్గంలో స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రాక,పోకలు నిలిచిపోయాయి. వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీని రాళ్లకాల్వ వాగు చుట్టు ముట్టింది. రెండు పూరి గుడిసెలు కూలిపోయాయి. తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, డీటీ భాను ఆ ప్రాంతాలకు వెళ్లి ఆయా వీఆర్‌వోలకు పలు ఆదేశాలిచ్చారు. ఆర్.మల్లవరం, కుమ్మరపల్లి, కృష్ణాపురంలో వరినాట్లు నీట మునిగాయి. పంట పొలాలు చెరువులను తలపించాయి. గుత్తివారిపల్లి, ఎస్‌యూపురం గ్రామాల్లో అరటితోటలు నేలకొరిగాయి.



వెదుళ్లచెరువు సమీపంలో రాళ్ల కాల్వ ప్రవాహ ఉధృతి, గుత్తివారిపల్లిలో నేలకొరిగిన అరటి చెట్లు


వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులతో మాట్లాడుతున్న రేణిగుంట సర్పంచ్ నగేషం


కల్లూరు వాగు వద్ద రాకపోకలను ఆపి కాపలా కాస్తున్న ఎస్ఐ ధర్మారెడ్డి

గోశాల ఆకస్మిక తనిఖీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలను ఆదివారం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల సిబ్బంది వర్షం కారణంగా రాకపోవడంతో ఉదయం 11.30 గంటలు దాటినా గోవులకు ఆహారం అందించక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి ఆహారం అందించాలన్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గోవులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోశాల సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న చైర్మన్ తారక శ్రీనివాసులు

ఎల్లమ్మ దేవతకు తాళిబొట్టు సమర్పణ


తాళిబొట్టును సమర్పిస్తున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లులో ఆదివారం ఎల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో వెలసిన ఎల్లమ్మ మూలవిరాట్టుకు విశేష పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి చుక్కలనిడిగల్లు చేరుకుని అమ్మవారికి బంగారు తాళిబొట్టును సమర్పించారు. సర్పంచ్ కిరణ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు


కాళంగి మార్గంలో ప్రవహిస్తున్న చిట్టత్తూరు వాగు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలంలో ఆదివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. శ్రీకాళహస్తి- కాళంగి మార్గంలో చిట్టత్తూరు వాగు రోడ్డుపై పొంగి పొర్లడంతో రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. తహసీల్దారు సుధీర్‌రెడ్డి చిట్టత్తూరు వాగును పరిశీలించి రాకపోకలు జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కారాకొల్లు మార్గంలోను వాగు పొంగిపొర్లుతోంది. బసవయ్యపాళెం చెరువులో నీటి నిల్వలు ఎక్కువ కావడంతో సమీపంలోని ఇళ్లలోకి చేరుతుండటంతో, తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తూము వద్ద చేరిన పూడికను తొలగింపజేసి నీరు బయటకు వెళ్లే ఏర్పాట్లు చేయించారు.

నిత్యావసర సరకుల పంపిణీ



ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ఎస్టీకాలనీలో ఆదివారం సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. తుపాన్ ప్రభావంతో కాలనీలోని సుమారు 15 కుటుంబాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపుదాం


దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక బైపాస్‌లోని వైఎస్సార్ సీపీ కంట్రోల్ రూమ్ వద్ద దివ్యాంగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు జగనన్న ప్రభుత్వం రూ.5 వేలు పింఛన్ వంటి పథకాలతో అన్ని విధాలుగా ఆదుకుంటోందని తెలిపారు. అంతకుముందు ఉదయం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తన సొంత ఖర్చులతో చెంచురాజుకండ్రిగ, సిద్ధిరాజు కండ్రిగ గ్రామాల్లోని దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాగలాపురం మండల అధ్యక్షుడు అపరంజిరాజు, పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా పరిశీలన పక్కాగా చేపటినట్టు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ భార్గవి తెలిపారు. ఆదివారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించి, జాబితాను పక్కాగా పరిశీలించినట్లు తెలిపారు. చేపట్టామన్నారు. మృతి చెందిన వారి పేర్లు, చిరునామాలు మారిన, డబుల్ ఎంట్రీలు, వివాహమైన వారి ఓట్లను తొలగింపును క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఫారమ్-6 కింద 69 మంది, ఫారమ్-7 కింద 21 మంది, ఫారమ్-8 కింద 17 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, పాల్గొన్నారు.

నమోదు క్రేంద్రాల పరిశీలన

సత్యవేడు: మండల పరిధిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను తహసీల్దార్ జరీనా పరిశీలించారు. మదనంబేడు, చెన్నేరి కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు మండలాల్లో ఫారం 6కు 296, ఫారం 7కు 139, ఫారం 8కు 244 అర్జీలు అందాయన్నారు. సత్యవేడు పరిధిలో ఫారం 6కు 59, ఫారం 7కు 19, ఫారం 8కి 54 వినతులు అందాయన్నారు.

తుపాను సహాయక చర్యల్లో నిమగ్నం కావాలి


తుపాన్ నివారణ చర్యలపై సూచనలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: తుపాన్ సహాయక చర్యల్లో అధికారులతో పార్టీ శ్రేణులు నిమగ్నం కావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కంట్రోల్ రూమ్‌లో పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అరణియార్‌కు వరదనీరు భారీగా వచ్చి చేరుతోందని తెలిపారు. సోమవారానికి పూర్తి స్థాయిలో రిజర్వాయర్ నిండే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టుపై డీఈ స్థాయి అధికారి 24 గంటలు పర్యవేక్షణలో ఉండే విధంగా చూడాలన్నారు. అధిక నీటిని బయటకు విడుదల చేయాల్సి వస్తే నిబంధనల మేరకు సైరన్ మోగించడంతోపాటు దిగువన ఉన్న అరుణానది పరివాహక ప్రాంత ప్రజలకు, తమిళనాడు ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. విపత్కర పరిస్థితి ఉంటే తన దృష్టికి తెస్తే కలెక్టర్ ద్వారా ఎస్‌డిఆర్‌ఎఫ్ బలగాలను రప్పించి సహాయక చర్యలు చేపడతామని తెలిపారు.

24గంటలు అందుబాటులో ఉండాలి

సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు తాము పని చేసే చోటే 24 గంటలు ప్రజలు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఎక్కడైనా వరద నీటి వల్ల ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరుగుతుందని తెలిస్తే తహసీల్దారు, ఎంపీడీఓలకు సమాచారం చేరవేసి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి వసతులు కల్పించాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాగలాపురం మండల అధ్యక్షుడు అపరంజిరాజు, పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, బోర్డు సభ్యులు సురేష్, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నాయకులు రమేష్ రాజు, మోహన్, శేఖర్ పాల్గొన్నారు.